క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 23, బెండ 55, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 9, క్యారెట్ 15. దొండ 45, ఆలు 18, ఉల్లి 16, గోకర 55, దోస 37, సొర 11, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 55, అర్వి 55, మునగ 45, చిలగడదుంప 37, బీట్‌రూట్ 19, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 65, క్యాప్సికమ్ రూ. 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

'ఆయుష్మాన్ భారత్'తో కార్పొరేట్ స్థాయి వైద్యం



నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎక్కడైనా ఒక్కో కుటుంబం ఒక్కో ఏడాదికి రూ. 5 లక్షల వరకు చికిత్స చేయించుకోవచ్చని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని రామాలయం వద్ద బుధవారం కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పేద, వెనుక బడిన వర్గాల కుటుంబాలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 80 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ ఉన్న ఫోన్‌తో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు గౌర దేవేందర్, రమేష్‌రెడ్డి, కొప్పుల దినేష్, వరప్రసాద్, చందు, సందీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి: సీఐటీయూ

చైతన్యపురి: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5వ తేదీన చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ కోరారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో సీఐటీయూ అధ్యక్షుడు మల్లెపాక వీరయ్య అధ్యక్షతన జరిగిన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లుగా ప్రజా వ్యతిరేక విధానాలతో పేద, మధ్య తరగతి ప్రజల బతుకులను భారంగా మార్చిందని అన్నారు. అలాగే ఈ నెల 18న జరిగే జీపు జాతాలో అందరూ పాల్గొనాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గోపీనాయక్, భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు ఉడుగు వెంకన్న, పరశురాములు, ఎల్లయ్య, నిర్మల, సైదులు, బోడ నర్సింహ, నరసింహ పాల్గొన్నారు.

కాన్షీరామ్ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న లక్ష్మణ్

మలక్‌పేట: బహుజనుల అభ్యున్నతికి కాన్షీరామ్ చేసిన కృషి మరువలేనిదని బీఎస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి అలుగోల రమేష్, సౌత్‌జోన్ కన్వీనర్ శైలజ అన్నారు. ఆ పార్టీ మలక్‌పేట అధ్యక్షుడు ఆడపు లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సలీంనగర్ బాలదానమ్మ బస్తీ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన కాన్షీరామ్ జయంతి కార్యక్రమానికి హాజరయ్యారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాన్షీరామ్ నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలకు ఎమ్మెల్యే, ఎంపీలుగా అవకాశం దక్కిందన్నారు. కాన్షీరామ్ ఆశయ సాధన కోసం యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బీవీఎఫ్ కన్వీనర్ సుమన్‌దాసు, ఉపాధ్యక్షులు అజార్ ఆలం, జనరల్ సెక్రటరీ ఇమ్రాన్ ఖాన్, మహేష్, దశరథ, సూరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట ఏఎస్‌ఓగా ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్



చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–1 ఏఎస్‌ఓగా ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినియోగదారులు ప్రభుత్వం ఇచ్చే అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కుక్కల వేట ముమ్మరం!

- కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్
- ఇప్పటివరకు 1080 వీధి కుక్కలకు శస్త్ర చికిత్స
- నిత్యం 150 కుక్కలకు ఆపరేషన్లు, యాంటీ రేబిస్ టీకాలు
- కుక్కల ప్రవర్తనపై విద్యార్థులకు అవగాహన

ఎల్‌బీనగర్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఐదు సర్కిళ్ల పరిధిలో నిత్యం 100 నుంచి 150 వరకు వీధి కుక్కలను వివిధ కాలనీలలో పట్టుకుంటున్నారు. ఆయా కుక్కలకు వెంటనే ఆపరేషన్లు చేయడంతోపాటు కుక్క కాటు వలన ప్రజలు రోగాల బారిన పడకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) కూడా వేస్తున్నారు.

వీధి కుక్కలకు కు.ని ఆపరేషన్లు

మార్చి నుంచి నిర్వహిస్తున్న కుక్కల వేటలో భాగంగా ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఇప్పటి వరకు సుమారు సుమారు 1080 కుక్కలకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. జీహెచ్ఎంసీ వెటర్నరీ

> జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్‌లోని ఐదు సర్కిళ్ల పరిధిలో ఈ నెల ప్రారంభం నుంచి కుక్కల వేట కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులతో పాటు రోజువారీగా కుక్కల వేట కోసం 10 వాహనాలతోపాటు అదనపు సిబ్బందిని నియమించారు.



వీధి కుక్కలను పట్టుకుంటుకున్న సిబ్బంది (ఫైల్)

అధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వీధి కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న ఆపరేషన్లకుగాను ఒక్కొక్క కుక్కకు రూ. 1500ల ప్రకారం చెల్లిస్తున్నారు. దీంతో కుక్కల ఆపరేషన్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇలా ఆపరేషన్లు చేసిన కుక్కలను తిరిగి ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలిపెడుతున్నారు. ఆపరేషన్ చేసిన కుక్కలకు చెవి భాగంలో కొంత మేర కత్తిరించడంతో ఆపరేషన్లయిన కుక్కలను సులువుగా గుర్తించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

కుక్కల ప్రవర్తనపై అవగాహన

విద్యార్థులకు కుక్కల ప్రవర్తనపై ఛాయాచిత్రాలను ప్రదర్శిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 285 పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. 85,900 మంది విద్యార్థులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారని అధికారులు వెల్లడించారు. కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో 563 కాలనీల్లో వీధి కుక్కల బెడదను ఎలా నివారించుకోవాలనే అంశాలపై ప్రజలను చైతన్యపర్చారు.

నిర్వాహకులకు నోటీసులు

చికెన్, మటన్ షాపు నిర్వాహకులు ఎక్కడ పడితే అక్కడ మాంసం వ్యర్థాలను వేయకుండా ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. దుకాణాల వద్ద వ్యర్థాలను వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు సుమారు 523 మంది చికెన్, మటన్ షాపుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. హాస్టల్ నిర్వాహకులకు కుక్కలపై అవగాహన కల్పించి... హాస్టళ్లలో మిగిలిపోయిన ఆహారం, ఇతర ఆహార వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి ముందుకు వచ్చే గార్బేజీ కార్మికులకే ఇవ్వాలని స్పష్టం చేస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్‌తో మంచి ఫలితాలు

వీధి కుక్కల బారి నుంచి చిన్నారులు, ప్రజలను కాపాడేందుకు వెటర్నరీ విభాగం చేపడుతున్న స్పెషల్ డ్రైవ్ మంచి ఫలితాలను ఇస్తోంది. విద్యార్థులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. కుక్కలు ఎదురైనప్పుడు ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించాం. వీధి కుక్కల కోసం ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో సుమారు 82 ప్రాంతాల్లో నీటి తొట్టిల ద్వారా తాగునీటిని అందజేస్తున్నాం. ఆపరేషన్లు చేయడం ద్వారా వాటి సంతానోత్పత్తిని తగ్గిస్తున్నాం. అవి కరిచినప్పుడు రేబిస్ వ్యాధి సోకకుండా ఆపరేషన్లు చేసే సమయంలోనే యాంటీ రేబిష్ టీకాలను వేస్తున్నాం. ప్రజలు కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ రంజిత్, ఎల్‌బీనగర్ జోనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్

సుస్వరాల గని కేవీ మహదేవన్

జస్టిస్ చంద్రకుమార్

హస్తినాపురం: స్వరాల కంటే సాహిత్యానికి పెద్దపీట వేసిన గొప్ప సంగీత దర్శకుడు కె.వి.మహదేవన్ అని ఉమ్మడి హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. గురువారం హస్తినాపురంలో స్వర బ్రహ్మ కేవీ మహదేవన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జస్టిస్ చంద్రకుమార్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... కవి పాట రాసిన తరువాతే మహదేవన్ స్వరాలు కూర్చేవారన్నారు. మహదేవన్ సంగీతం అందించిన మంచి మనసులు చిత్రంలోని మామా.. మామా పాట అప్పటికి... ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ పాటగా నిలిచిందన్నారు. ఆ పాటతోనే ఆయనను అందరూ మామా అని పిలిచే వారని గుర్తుచేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన మాజీ ఐఏఎస్ అధికారి టి.సత్యనారాయణరావు మాట్లాడుతూ... సంగీతం విశ్వజనీయమైనదని



మహదేవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

అన్నారు. ముఖ్యంగా మహదేవన్ సంగీతం అందించిన శంకరాభరణం సంగీతం ప్రపంచంలో గొప్పమైలు రాయి అంటూ ప్రశంసించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన మాజీ సైనికాధికారి మేజర్ జనరల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ... కుటుంబాలకు దూరంగా ఉండే సైనికులకు సంగీతమే ఎంతో ఊరట కలిగిస్తుందన్నారు. కార్యక్రమానికి ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించారు. సంగీత అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆమె వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ జీఏ–1 కాలనీలో పర్యటించారు. కాలనీలోని పద్మావతి కల్యాణ మండపం సమీపంలోని పలు గృహాలకు తాగునీటి సరఫరా సరిగా జరగడం లేదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల వలన పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పైప్‌లైన్ల ఆధునికీకరణతో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. జీఏ–1 కాలనీలో వెంటనే పైప్‌లైన్‌లు నూతనంగా ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ఆమె వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. వాటర్ వర్క్స్ ఏఈ శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్, నర్సింహా, రామ్‌రాజు, రామకృష్ణ, భార్గవ్, నీరజ పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల పాలన చాలు.. ఇక ఇంటికి పో దొర

మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి

మన్సూరాబాద్: అయ్యా.. కేసీఆర్ దొర మీ తొమ్మిదేళ్ల పాలన చాలు.. త్వరగా ఇంటి మార్గం పడితే తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉంటారని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అన్నారు. సామ రంగారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో గురువారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమెతో పాటు ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజానికి మెతకవైఖరి పనికిరాదని, మహిళలు ధైర్యంతో ఎదురు తిరగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, తప్పులు చేసిన వారికి ప్రభుత్వం సాయం అందిస్తోందని విమర్శించారు. వేతనాలు పెంచాలని పోరాటాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా డ్వాక్రా మహిళలను కేసీఆర్ సర్కార్ నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ఒక్కో రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారి లక్షల కోట్లు మింగి.. డబ్బు అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ కూతురు లిక్కర్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని, మహిళలు మద్యం వ్యాపారం చేయడం సీఎం కుమార్తెకే చెల్లిందని దుయ్యబట్టారు. అయ్యా దొరా.. తొమ్మిదేళ్ల పరిపాలన చాలు.. తొందరగా దిగి ఇంటి మార్గం పట్టు అని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్పొరేటర్లు కొప్పుల



మాట్లాడుతున్న మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ సభ్యురాలు విజయశాంతి

నర్సింహారెడ్డి, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నవజీవన్‌రెడ్డి, రాధ ధీరజ్‌రెడ్డి, చింతల అరుణ సురేందర్‌యాదవ్, మహిళామోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలతి, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, నందికొండ గీతారెడ్డి, నూకల పద్మారెడ్డి, మన్నెం అరుణ, చిల్కూరి మాధవి, కవితారెడ్డి, కర్నాటి మాధవి తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వర స్వామికి విజయశాంతి ప్రత్యేక పూజలు

విజయశ్రీకాలనీలోని శ్రీపద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గోదాసమేత వెంకటేశ్వర స్వామివార్లకు గురువారం మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, కాలనీ నేతలు మార్గం రాజేష్, సామ వెంకట్‌రెడ్డి, భీమిడి నర్సింహారెడ్డి, కొండల్ రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, లోకేష్‌గౌడ్, కొండల్‌రావు, నర్సింహాచారి, రామచందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

18 వరకు ఉచిత వైద్యశిబిరం

సైదాబాద్: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్‌కుమార్ సూచించారు. ఐఎస్‌సదన్‌లో ఆయన మాట్లాడుతూ... అమ్మ ఫౌండేషన్ ప్రగతి జాగృతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన ఉచిత వైద్య శిబిరం శనివారం వరకు కొనసాగుతుందన్నారు. సింగరేణి కాలనీలో మూడు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సింగరేణి కాలనీ రోడ్ నెం.14లో అక్షరజ్యోతి స్లమ్ ఎడ్యుకేషన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్న శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో సహా అందరూ పరీక్షలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. కిడ్నీ, గుండె, షుగర్, లివర్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉదయం నిర్వహించి మధ్యాహ్నం వరకు రిపోర్ట్‌లు అందజేస్తామన్నారు. అవసరమైన వారికి మందులు అందజేస్తామని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వినియోగదారులను మోసగిస్తే సహించం

నాగోలు: వినియోగదారులను మోసం చేస్తున్న సంస్థలపై ఉక్కుపాదం మోపాలని తెలంగాణ వినియోగదారుల ఫోరం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు పగిళ్ల జోజి, రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యూనాగోలు కాలనీలో ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రామాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోజి మాట్లాడుతూ... నిత్యావసర సరుకుల కల్తీలను నివారించాలని, వివిధ సంస్థలు, శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజలకు ఇప్పటికీ కల్తీలతో మోసాలకు గురవుతున్నారన్నారు. అధిక ధరలకు విక్రయించడం, తూకంలో మోసాలు, వీటిని నేరాలుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. వినియోగదారులను చైతన్య పరుస్తూ జిల్లా, మండల స్థాయి వినియోగదారులు కమిటీలు పనిచేయాలన్నారు. నాయకులు యాదగిరి, ఇస్మాయిల్, బి.యాదయ్య, రవి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

'హక్కుల సంఘం' జనరల్ సెక్రటరీగా రాంచందర్‌రావు



రాంచందర్‌రావు

దిల్‌సుఖ్‌నగర్: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కేపురం డివిజన్ చిత్ర లేఅవుట్ కాలనీ చెందిన రాంచందర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సౌత్ జోనల్ బోర్డు అధ్యక్షులు జ్యోతిర్మయి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ... మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సమాజంలో మానవ హక్కుల ఉల్లఘనకు ఎవరైనా గురైతే తమను సంప్రదిస్తే తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జ్యోతిర్మయికు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో వైద్యాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిప్రియ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డయాలసిస్, ఇతర రోగుల సౌకర్యార్థం ఆస్పత్రిలో లిఫ్ట్ వసతి కల్పించాలని ఆమె కోరారు. ఆస్పత్రిలో సరైన మంచినీటి సౌకర్యం లేదని, నీటి కోసం ఆస్పత్రి తరపున రూ. 30 లక్షలు కంట్రిబ్యూషన్ చెల్లించలేమని ఆమె ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు. స్పందించిన ఎమ్మెల్యే ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుతో మాట్లాడి ఆస్పత్రికి మంచినీటి కనెక్షన్ ఇప్పి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

స్తామని అన్నారు. మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీతో మాట్లాడి లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైద్యులు, సిబ్బంది ఆస్పత్రికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరైన వైద్యసేవలు అందించాలని, ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బంది రాజన్, గఫర్, ఈశ్వరమ్మ, సునీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌చౌక్‌లో ఏబీవీపీ రాస్తారోకో



రాజీవ్‌చౌక్‌లో ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చైతన్యపురి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆక్యారి మహేష్, ఎల్‌బీనగర్ కన్వీనర్ శ్యాంకిరణ్ మాట్లాడుతూ... వందల మంది నిరుద్యోగుల ఆత్మబలిదానం వల్ల వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో నేడు నిరుద్యోగుల పాలిట కేసీఆర్ ప్రభుత్వం శాపంలా మారిందని విమర్శించారు. అరకొర నోటిఫికేషన్‌లు ఇచ్చినా సక్రమంగా పరీక్షలు నిర్వహించటంలో టీఎస్‌పీఎస్సీ విఫలం అయిందని ఆరోపించారు. ప్రశ్నపత్రాల లీకేజీలతో నిరుద్యోగుల ఆశలు అడియాశలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2.91 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసే టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ చైర్మన్, కార్యదర్శి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి బొంద పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ సిటీ కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమాన్, దీప్తి, మౌనిక, మధు, సతీష్, రమేష్, సందీప్, గంగాధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌నగర్ బస్తీలో కలుషిత నీటిని అరికట్టండి



నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: మోహన్‌నగర్ బస్తీలో తరచు నెలకొంటున్న కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని... ఇందుకు వెంటనే కొత్త పైప్‌లైన్ వేయాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. స్థానికంగా మూడు రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోందని బస్తీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గురువారం మోహన్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటించారు. జలమండలి సూపర్‌వైజర్లు ఆరిఫ్, దయాకర్, సత్యనారాయణను పిలిపించి సమస్యను పరిశీలించారు. తాగునీటిలో కలిసిన మురుగు నీటిని చూపిస్తూ డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కాలనీ నేతలు అనిల్ కుమార్. బీజేపీ నాయకులు రామకృష్ణ, కొత్త తిరుమల, గట్టు మహేష్, వెంకట్ రెడ్డి, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అబ్కారీ, క్రీడలు, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అబ్కారీ గజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలో అనాథ విద్యార్థి గృహంలోని పిల్లలకు పండ్లు, మిఠాయిలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌జీఓ రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, కోశాధికారి పి. రవీందర్ కుమార్, అబ్కారీ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు టి. రవీందర్ రావు, ప్రధాన కార్యదర్శి డి. అరుణ్ కుమార్, సహాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి టి.లక్ష్మణ్ గౌడ్, కమర్షియల్ టాక్స్ అధ్యక్షుడు బి. వెంకటయ్య, మేడ్చల్ అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, శిరీష, అబ్కారీ అధికారులు బి.హనుమంత రావు, కె. శ్రీనివాస్, జి.శ్రీనివాస్ రావు, చంద్ర శేఖర్ గౌడ్, కల్పన, సరళ, విష్ణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనాథ విద్యార్థి గృహ మేనేజింగ్ డైరెక్టర్ మార్గం రాజేష్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏజెన్సీ టు మహారాష్ట్ర

- గంజాయి అక్రమ రవాణా: ఇద్దరి అరెస్ట్
- రూ. 70 లక్షల విలువైన గంజాయి స్వాధీనం


నాగోలు: ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను హయత్‌నగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.70 లక్షల విలువైన 160 కిలోల గంజాయి, డీసీఎం, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. ఒరిస్సా సరిహద్దు ప్రాంతానికి చెందిన లాల్‌బి గులాం షేక్, కర్ణాటకకు చెందిన బాబూరావు పంచన్, మహారాష్ట్రకు చెందిన ఆకాష్ కాంబ్లే, విశాఖపట్నానికి చెందిన ఆకాష్, ప్రసాద్, రాణి ముఠాగా ఏర్పడి ఏజెన్సీ ప్రాంతం నుంచి కర్ణాటక, మహారాష్ట్రకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారు. బుధవారం రాత్రి వాహన తనిఖీల్లో భాగంగా హయత్‌నగర్ పోలీసులు పెద్దఅంబర్ పేట్ మీదుగా మహారాష్ట్ర వెళ్తున్న డీసీఎంను ఆపి సోదా చేయగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో డీసీఎంలో ఉన్న బాపూరావు పంచన్, ఆకాష్ కాంబ్లే అనే వ్యక్తులను అరెస్ట్ చేశారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు లాల్ బీ గులాం షేక్ తో పాటు ప్రసాద్, అన్వర్ పాషా, రాణి పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

వాహనాల తనిఖీలకు సహకరించాలి: ఏసీపీ శ్రీధర్‌రెడ్డి

చైతన్యపురి: పోలీసులు చేపడుతున్న వాహనాల తనిఖీలకు ప్రజలు సహకరించాలని ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ... ఇటీవల చైన్ స్నాచింగ్‌లు జరుగుతున్న తరుణంలో అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. నంబర్‌లేని, నంబర్ సరిగాలేని ద్విచక్ర వాహనాలపై దుండగులు కాలనీలలో తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడల్లోని చైన్‌లను లాక్కొని పారిపోయిన సంఘటనలు అక్కడక్కడా చోటు చేసుకున్నాయని తెలిపారు. రాచకొండ సీపీ ఆదేశాల మేరకు నంబర్ లేని వాహనాలపై తగు చర్యలు తీసుకునేందుకే వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేరాలను అదుపు చేసే ఉద్దేశంతోనే తనిఖీలు తప్ప ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కాదన్నారు. తనిఖీలలో ఆపినప్పుడు విధిగా తమ డాక్యుమెంట్లు చూపించాలని కోరారు. బుధవారం రాత్రి చైతన్యపురి స్టేషన్ పరిధిలో బైక్ ఆపకుండా వేగంగా వెళ్లిన ఓ యువకుడు కిందపడి గాయాల పాలయ్యాడని, మద్యం సేవించి ఉన్న కేదార్‌నాథ్ అనే యువకుడు తమ తప్పు కప్పిపుచ్చుకునేందుకు పోలీసులపై ఆరోపణలు చేశారన్నారు. అంతే కాక సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని అతనిపై కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. వాస్తవాన్ని దాచిపెట్టి పోలీసుల ప్రతిష్ట దెబ్బతీసేలా విమర్శలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.



చలివేంద్రం ప్రారంభం

మలక్‌పేట: వేసవిలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోషల్ వర్కర్ పున్‌రెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్ బతుకమ్మ క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.